సాక్షి
మంచిర్యాల

బుధవారం : 2 : జూలై : 2025



ఆన్‌లైన్ జూదం.. జీవితాలు ఆగం
జిల్లాలో ఆన్‌లైన్ రమ్మీ గేమింగ్ యాప్‌ల వినియోగం క్రమంగా పెరుగుతోంది. ఎంతోమంది ఈ ఉచ్చులోకి దిగి డబ్బులు పోగొట్టుకుని అప్పుల పాలవుతున్నారు. 8లో▸



వరదొస్తే రాకపోకలు బంద్!
బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రాంనగర్–హన్మాన్ బస్తీల మధ్య వాగుపై లోలెవెల్ కల్వర్టు నిర్మించారు. వర్షాకాలంలో దీనిపై వరదనీరు పొంగి ప్రవహిస్తోంది. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
30.0 /25.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

కేజీబీవీ ఎస్వో తొలగింపు

దండేపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీ ఎస్వో మంజులను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ కుమార్ దీపక్ ఉత్వర్వులు జారీ చేసినట్లు ఎంఈవో చిన్నయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొద్దిరోజుల క్రితం పాఠశాలలో భోజనం సరిగా పెట్టడం లేదని, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు విద్యార్థులు వారి తల్లిదండ్రులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఈవో యాదయ్య విచారణ చేపట్టారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు కూడా పాఠశాలను సందర్శించినపుడు విద్యార్థులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన అధికారులు తగు చర్యల నిమిత్తం ఎస్వో మంజులను విధుల నుంచి తొలగించారు. మంజుల స్థానంలో పాఠశాలలో పనిచేస్తున్న సోషల్ సీఆర్టీ భాగ్యలక్ష్మికి ఎస్వోగా పూర్తి బాధ్యతలు అప్పగించినట్లు ఎంఈవో పేర్కొన్నారు.

మూడోరోజూ అదే ముసురు



మంచిర్యాల బస్టాండ్ రోడ్డుపై నిలిచిన నీరు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాను మూడురోజులుగా ముసురు వీడడం లేదు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు కూడా కొనసాగుతూనే ఉంది. చల్లని ఈదురుగాలలు వీస్తుండడంతో చిన్నారులు, వృద్ధులు వణుకుతో మంచం పడుతున్నారు. ఆలస్యంగానైనా పత్తిపంటకు అనుకూల వర్షం కురుస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 8.8 మిల్లీ మీటర్ల వర్షం

జిల్లాలో మంగళవారం 8.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దండేపల్లి 33.3 మిల్లీమీటర్లు, లక్సెట్టిపేట 14, జన్నారం 11.6, హాజీపూర్ 12.5, భీమిని 10.1, వేమనపల్లి 8.8, బెల్లంపల్లి 8.6, కన్నెపెల్లి 8.4, తాండూర్ 8, కోటపల్లి 7.5, నెన్నెల 6, మంచిర్యాల 5, కాసిపేట 4, నస్పూర్ 3.4, జైపూర్ 3, చెన్నూరు 3.5, భీమారం 1.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా సాధారణ వర్షపాతం 168 మిల్లీమీటర్లు కాగా, 104.5 మిల్లీమీటర్లు కురిసింది. 38శాతం లోటు నెలకొంది.

నిషేధాజ్ఞలు పొడిగింపు

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో అమలులో ఉన్న నిషేధాజ్ఞలు పొడిగించినట్లు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, అనుమతి లేకుండా డీజే వినియోగించరాదని, డ్రోన్ కెమెరాలు ఎగురవేయొద్దని సూచించారు. నిషేధాజ్ఞలు ఆగస్టు 1వరకు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. ఉల్లంఘించిన వారిపై బీఎన్ఎస్ 223 హైదరాబాద్ నగర పోలీస్ చట్టం 1348 నిబంధనలు అనుసరించి చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలఅర్బన్: ఈనెల 13లోపు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి 2025 సంవత్సరానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో యాదయ్య ఓ ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ పాఠశాల విద్య, అక్షర మంత్రిత్వశాఖ శాస్త్రీ భవన్, న్యూఢిల్లీ వెబ్‌సైట్ htpp:// nationalawardst oteachers.govt.inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ, మండల పరిషత్, కేంద్ర ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

నైపుణ్యాల పెంపునకు నిరుద్యోగ యువతకు శిక్షణ

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ఎంబీసీ నిరుద్యోగ యువతకు తెలంగాణ అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ, హైదరాబాద్ ఆధ్వర్యంలో వివిధ నైపుణ్యాల పెంపునకు హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయస్సు 21–30 ఏళ్లు, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం(ఎంబీసీ 36 కులాల వారు మాత్రమే), ఆదాయ ధ్రువీకరణ పత్రం (గ్రామీణ ప్రాంతం వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతం వారికి రూ.2 లక్షలు) ఉండాలని తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 12లోపు tgobmms. cgg. gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారానికి ధ్రువపత్రాలను జతచేసి కలెక్టరేట్‌లోని ఎఫ్–5లోగల జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఈ నెల 14న సాయంత్రం 5లోపు ఇవ్వాలని తెలిపారు. అర్హులకు నాలుగు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ట్రావెలింగ్ అలవెన్స్, వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు.

తడి.. పొడి.. మొక్కుబడి

- కలిపే సేకరిస్తున్న పారిశుధ్య సిబ్బంది
- బయోవేస్టేజ్, మాంసపు వ్యర్థాలు కూడా..
- ప్రజలకు అవగాహన కల్పించే వారేరి?
- డంప్‌యార్డుల్లోనూ వేరుచేయని వైనం
- మున్సిపాలిటీల్లో వాహన డ్రైవర్ల కొరత

పేరుకే కార్పొరేషన్.. చెత్తతో పరేషాన్

సాక్షి ఫోకస్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలో రోజుకు 55 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. తడి, పొడి చెత్త కలపడం, బయోవేస్టేజ్, మటన్ మార్కెట్ ప్రాంతాల నుంచి వెలువడే వ్యర్థాలనూ డంప్‌యార్డుకే తరలిస్తుండడం ఇబ్బందిగా మారుతోంది. కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లుండగా 2,48,283 మంది జనాభా ఉన్నారు. నస్పూరు, వేంపల్లి, ముల్కల్ల, గుడిపేట్‌తో పాటు దొరగారిపల్లె, తిలక్‌నగర్, రాజీవ్‌నగర్, సాయికుంట, పాతమంచిర్యాల, రంగంపేట్, వికాస్‌నగర్ ప్రాంతాల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. 513 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. చెత్త తరలించేందుకు 83 ఆటో ట్రాలీలు, 25 ట్రాక్టర్లున్నాయి. వీటిని నడిపేందుకు 23 మంది డ్రైవర్లు మాత్రమే ఉన్నారు. దీంతో పారిశుధ్య కార్మికుల్లో డ్రైవింగ్ వచ్చిన వారికి వాహనాలు అప్పగిస్తున్నారు.

చుట్టపు చూపుగా వస్తూ..

కొందరు పర్మినెంట్ ఉద్యోగులు ఉదయం వచ్చి అటెండెన్స్ వేసుకుని వెళ్లిపోతున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ఇతర కార్మికులపై అదనపు భారం పడుతోంది. చెత్తను సక్రమంగా తరలించి తడి, పొడి చెత్త వేరు చేస్తేనే నగరం పరిశుభ్రంగా ఉండే అవకాశముంది. కానీ డ్రైవర్ల కొరత, కొందరు కార్మికులు హాజరు వేసుకుని ఇళ్లకు వెళ్లిపోవడం లాంటి కారణాలతో చెత్త సేకరణ సరిగా జరగడంలేదు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మంచి ర్యాంక్ సాధించేందుకు నగరంలోని పలు ప్రాంతాల్లో తడి, పొడి, హానికర చెత్తను వేర్వేరుగా నిల్వ చేసేందుకు మూడు రంగుల డబ్బాలు ఏర్పాటు చేశారు. చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించక పోవడంతో చాలామంది తడి, పొడి చెత్తను కలిపే చెత్త వాహనాల్లో వేస్తున్నారు. బయోవేస్టేట్, మటన్ మార్కెట్ వద్ద వ్యర్థాలు కూడా తోడవడంతో డంప్‌యార్డు వద్ద దుర్గంధం వ్యాపిస్తోంది. సమీప నివాసాల ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఆండాళమ్మ కాలనీలో తడి, పొడి చెత్త వేరు చేసేలా షెడ్లు నిర్మించినా వాటిని వినియోగించడం లేదు. చెత్త వేరు చేయకుండా అంతా ఒకేచోట కలిపేస్తున్నారు. చెత్తాచెదారంతో డంప్‌యార్డు నిండిపోవడంతో మిషన్‌భగీరథ వాటర్ ట్యాంక్ సమీపంలో డంప్ చేస్తున్నారు.



మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో తడి, పొడి చెత్త కలిపి సేకరిస్తున్న కార్మికులు

మంచిర్యాల కార్పొరేషన్ వివరాలు		
మొత్తం జనాభా : 2,48,283	కార్పొరేషన్ డివిజన్లు : 60	ఒక్కరోజు వెలువడే చెత్త : 55 మెట్రిక్ టన్నులు
మొత్తం కార్మికులు : 513 మంది	చెత్త తరలించే ఆటో ట్రాలీలు : 83	
చెత్త తరలించే ట్రాక్టర్లు : 25	వాహనాల డ్రైవర్లు : 23 మంది	

గోదావరి రోడ్డే డంప్‌యార్డు



గోదావరి రోడ్‌లోని చెత్త కుప్పలు

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలో 15 వార్డులున్నాయి. 24,543 మంది జనాభా ఉన్నారు. గోదావరి రోడ్‌లో డంప్‌యార్డు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో రోజుకు 12 టన్నుల చెత్త వెలువడుతుండగా ఇందులో తడి చెత్త ఆరు, పొడి చెత్త రెండు, మిక్స్‌డ్ చెత్త ఒక టన్ను వరకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. చెత్త తరలింపునకు 14వాహనాలు, ఒక బ్లేడ్ ట్రాక్టర్ ఉన్నాయి. 60 మంది పారిశుధ్య సిబ్బంది ఉన్నా సరిపోవడం లేదని, ఇంకా 20 మంది కావాలని అధికారులు తెలిపారు.

దుర్గంధం వ్యాపిస్తోంది



గోదావరి రోడ్‌లోని డంప్‌యార్డు నుంచి దుర్గంధం వ్యాపిస్తోంది. సేకరించిన చెత్తను దూరంగా డంప్ చేయాలి. కాలనీల్లో పరిశుభ్రత లోపిస్తోంది. రోడ్ల పక్కన చెత్త కుప్పలు, పిచ్చిమొక్కలు లేకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– తిరుపతి, 12వ వార్డు

కంపు కొడుతున్న 'క్యాతనపల్లి'



భగత్‌సింగ్‌నగర్‌లో పేరుకుపోయిన చెత్త

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో చెత్త సమస్యకు సరైన పరిష్కారం లభించడం లేదు. బల్దియాలో మొత్తం 22 వార్డులుండగా దాదాపు 48,950 మంది జనాభా ఉన్నారు. మున్సిపాలిటీలో ఎక్కువ వార్డులు సింగరేణి పరిధిలో ఉండటంతో చెత్త సేకరణ సమస్యగా మారింది. మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణ దాదాపు నిత్యం జరుగుతుండగా సింగరేణి పరిధిలోని కాలనీల్లో రెండు, మూడు రోజులకోసారి చెత్త సేకరిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించడం కాకుండా సింగరేణి ఆధ్వర్యంలో పాత పద్ధతిలోనే చెత్త సేకరణ కొనసాగుతోంది. దీంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి కాలనీలు కంపు కొడుతున్నాయి. చెత్త సేకరణకు 16 ఆటోలు, రెండు ట్రాక్టర్లు, 20 మంది వరకు డ్రైవర్లున్నారు. రోజుకు సుమారు 14 మెట్రిక్ టన్నుల చెత్తను మున్సిపాలిటీ సిబ్బంది సేకరిస్తున్నారు. తొమ్మిదోవార్డు పరిధి పెద్దది కావడంతో చెత్త సేకరణ కోసం త్వరలో రెండు, మూడు పెద్ద ట్రాలీలు కొనుగోలు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు.

క్యాతనపల్లి మున్సిపాలిటీ వివరాలు

మున్సిపల్ వార్డులు : 22	
జనాభా : 48,950	
రోజుకు వెలువడే చెత్త : 14 మెట్రిక్ టన్నులు	
చెత్త సేకరించే వాహనాలు : 18	

చెన్నూర్‌లో చెత్త కుప్పలు



లైన్‌గడ్డలో డ్రైనేజీ పక్కన తొలగించని చెత్త కుప్ప

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. రెండు, మూడు రోజులకోసారి చెత్త వాహనాలు రావడంతో కుప్పలుగా పేరుకుపోతోంది. వానాకాలం కావడంతో చెత్త కుప్పల నుంచి దుర్గంధం వ్యాపిస్తున్నట్లు సమీప నివాసాల ప్రజలు వాపోతున్నారు. 18 వార్డులుండగా 25,579 మంది జనాభా ఉన్నారు. రోజూ చెత్త సేకరించాలనే లక్ష్యంతో నాలుగేళ్ల క్రితం 18 వాహనాలు కొనుగోలు చేశారు. ఇందులో 11 వాహనాలు మూలనపడి మరమ్మతుకు నోచుకోవడం లేదు. ప్రస్తుతం ఏడు వాహనాల ద్వారానే చెత్త సేకరించాల్సి వస్తోంది. వాహనాల కొరతతో వార్డుల్లో రెండు, మూడురోజులకోసారి చెత్త సేకరిస్తున్నారు. దీంతో కాలనీల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. గతంలో ఒక్కో చెత్త వాహనానికి డ్రైవర్‌తో పాటు హెల్పర్ ఉండేవారు. వీరు ఆయా కాలనీల నుంచి సేకరించిన చెత్తను డంప్‌యార్డుకు తరలించేవారు. ప్రస్తుతం ఒక్కో వాహనానికి ఒక్క డ్రైవర్ మాత్రమే ఉండడంతో ఇళ్ల నుంచే చెత్త సేకరిస్తున్నారు. దీంతో పారిశుధ్యం లోపించి జనం పరేషాన్ అవుతున్నారు. రోజూ చెత్త సేకరించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

చెన్నూర్ మున్సిపాలిటీ వివరాలు

మున్సిపల్ వార్డులు : 18	
జనాభా: 25,579 మంది	
చెత్త సేకరించే వాహనాలు : 18	
వినియోగిస్తున్నవి : 7	
మూలనపడ్డవి : 11	

కంపు భరించలేకపోతున్నం



చెత్త బండ్లు మూడు రోజులకోసారి వస్తున్నయ్. దీంతో కాలనీలో రోడ్ల వెంట ఎక్కడ పడితే అక్కడే చెత్త పేరుకుపోతోంది. వానాకాలం కావడంతో చెత్త కుప్పల్లో పందులు దొర్లుతున్నాయి. కంపు భరించలేకపోతున్నం. రోజూ చెత్త తరలించేలా చూడాలె.

– మధునక్క, లైన్‌గడ్డ, చెన్నూర్

బెల్లంపల్లి.. చెత్త లొల్లి



కాల్‌టెక్స్ ఏరియాలో రోడ్డు పక్కనే డంప్ చేసిన చెత్త

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో చెత్త సేకరణ అస్తవ్యస్తంగా తయారైంది. వార్డుల్లో వారం రోజులకోసారి చెత్త సేకరించేందుకు ఆటో ట్రాలీలు వస్తుండగా ఇళ్లు, వీధుల్లో చెత్త పేరుకుపోతోంది. మున్సిపల్ పరిధిలో 34 వార్డులుండగా 2011 జనాభా లెక్కల ప్రకారం 56,396 మంది జనాభా ఉన్నారు. చెత్త సేకరణకు సరిపడా ఆటో ట్రాలీలు లేవు. గతంలో 23 ఆటో ట్రాలీలు కొనుగోలు చేయగా వీటిలో ప్రస్తుతం 12 మాత్రమే వినియోగంలో ఉన్నాయి. మిగతా 11 మరమ్మతుకు నోచుకోక నిరుపయోగమయ్యాయి. ఆటో ట్రాలీల కొరతతో చెత్త సేకరణలో ఇబ్బందులేర్పడుతున్నాయి. కొన్ని వార్డుల్లో వారానికి రెండ్రోజులు, మరికొన్ని వార్డుల్లో వారానికోసారి ఆటో ట్రాలీలు వస్తున్నట్లు ఆయా కాలనీల ప్రజలు చెబుతున్నారు. ఇక తడి, పొడి చెత్త వేర్వేరు చేయడంలేదు. ఎనిమిదేళ్ల క్రితం తడి, పొడి చెత్త వేరు చేసి ఇచ్చేందుకు ఇంటింటికీ ప్లాస్టిక్ డబ్బాలు అందజేసినా ప్రజలు రెండింటినీ కలిపే ఇస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో రోజుకు 25 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడతుండగా 10 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరిస్తున్నారు. పేరుకు ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీ అయినప్పటికీ ఇప్పటివరకు డంప్‌యార్డు ఏర్పాటు చేయలేదు. సేకరించిన చెత్తను శ్మశాన వాటిక, బస్తీల శివారు ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. వానాకాలం కావడంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధులు విజృంభించే అవకాశముంది. మున్సిపల్ పరిధిలోని డ్రైనేజీలు శుభ్రం చేయడంలేదు. రోజువారీగా చెత్త సేకరించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బెల్లంపల్లి మున్సిపాలిటీ వివరాలు

మున్సిపల్ వార్డులు : 34	
జనాభా: 56,396	
రోజుకు వెలువడే చెత్త: 25 మెట్రిక్ టన్నులు	
సేకరిస్తున్న చెత్త : 10 మెట్రిక్ టన్నులు	
ఆటో ట్రాలీలు : 23	
వినియోగిస్తున్నవి : 12	
మూలనపడ్డవి : 11	

మెనూ ప్రకారం భోజనం అందించాలి

భీమిని: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం కన్నెపల్లి మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. అధికారులు సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం కన్నెపల్లి, టేకులపల్లిలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. కన్నెపల్లిలోని కేజీబీవీని సందర్శించి వంటశాల, తరగతి గదులు, రిజిస్టర్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. కన్నెపల్లి ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్ల మూసి ఉండగా నీటి వసతి కల్పించి విద్యార్థులు వినియోగించుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి చిన్నారుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో చేపట్టిన పీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.



భీమిని: కన్నెపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువు చూస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

బాలల హక్కులు కాపాడాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: బాలల హక్కులను కాపాడాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంక్షేమ శాఖల అధికారులు, పోలీస్, కార్మిక, విద్య, వైద్య ఆరోగ్య శాఖల అధికారులతో ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 31వరకు బృందాలుగా ఏర్పడి జిల్లాలోని అన్ని పని ప్రదేశాలను సందర్శించాలని తెలిపారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. సీడబ్ల్యూసీ చైర్మన్ వహీద్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్, జిల్లా సంక్షేమశాఖల అభివృద్ధి అధికారి దుర్గాప్రసాద్, పురుషోత్తం, మైనార్టీ శాఖ అధికారి రాజేశ్వరి, డీఈవో యాదయ్య, బెల్లంపల్లి, జైపూర్ ఏసీపీలు రవికుమార్, వెంకటేశ్వర్లు, బాలల పరిరక్షణ కమిటీ అధికారి ఆనంద్ ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. కలెక్టర్ చాంబర్‌లో గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు–భవనాలు, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

నూతన నియామకం

జన్నారం: మండలంలోని కామన్‌పల్లికి చెందిన కత్తెరపాక రాజేశ్‌ను స్కౌట్ డిస్ట్రిక్ట్ ఆర్గనైజింగ్ కమిషనర్‌గా నియమిస్తూ మంగళవారం న్యూఢిల్లీకి చెందిన నేషనల్ కమిషనర్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలంగాణ స్టేట్ స్కౌట్ ఆర్గనైజింగ్ కమిషనర్ అశోక్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజేశ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.



రాజేశ్

పాల ధర పెంచి, తగ్గించి..

- వసతి గృహాలకు సరఫరా తీరిది
- మొదట రూ.2 అధికంతో ఉత్తర్వులు
- కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఎమ్మార్పీకే

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రభుత్వ విద్యావసతి గృహాలకు పాల సరఫరాకు పంపిణీదారుడు ఎమ్మార్పీ కంటే అధికంగా పొందడంపై కలెక్టర్ కుమార్ దీపక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదట ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేస్తూ.. నిర్ణీత ధరకే సరఫరా చేయాలని ఆదేశాలిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని సర్కారు సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీ ఉత్పత్తులనే వాడాలి. ఇందుకోసం విజయ డెయిరీ నుంచి గుర్తింపు పొందిన పంపిణీదారులే సరఫరా చేయాలి. జిల్లాలో బీసీ, ఎస్సీ, మైనార్టీ, సోషల్ వెల్ఫేర్, కస్తూరిబా వసతి గృహాలకు విజయ పాలనే సరఫరా చేస్తున్నారు. అయితే పాల కేంద్రం నుంచి ఎమ్మార్పీ కంటే తక్కువగానే పంపిణీ దారుడికి అందుతుంది. విక్రయించేటప్పుడు విద్యాసంస్థలకు ఎమ్మార్పీకే అందించాలి. ఇందులోనే రవాణా ఖర్చులు కలుపుకొని సరఫరా చేయాలి. ఇందుకోసం డెయిరీ నుంచి కమీషన్ గతంలో రూ.8ఉండగా, ప్రస్తుతం రూ.7 చెల్లిస్తోంది. రూపాయి కమీషన్ తగ్గిందని, మారుమూల ప్రాంతాలకు రవాణా చేయడం, బిల్లులు రాక ఇబ్బందులని చెబుతూ ఎమ్మార్పీ కంటే అధికంగా ఉత్తర్వులు పొందారు. వాస్తవానికి విజయ డెయిరీ లీటర్ పాల ధర రూ.60 ఉండగా, జిల్లాకు చెందిన పంపిణీ దారుడికి రూ.62 చెల్లించేలా డెయిరీ ఉన్నతాధికారులు అవకాశం కల్పించారు. దీంతో అదనంగా ప్రభుత్వంపై భారం పడుతోంది.

10 వసతి గృహాలకు ఉత్తర్వులు

ఈ విద్యాసంవత్సరం గత నెల12న ప్రారంభం కాగా విద్యార్థుల అడ్మిషన్లు పూర్తయి వసతి గృహాల్లో చేరుతున్నారు. ఈ ఏడాది నుంచే జిల్లాలోని 10 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ హాస్టళ్లకు ఎమ్మార్పీ కంటే రూ.2 అదనంగా పంపిణీ దారుడికి లబ్ధి చేకూరేలా విజయ డెయిరీ ఉన్నతాధికారులు వ్యవహరించారు. మిగతా వసతి గృహాలు ఈ అవకాశం ఇవ్వలేదు. కలెక్టర్‌కు ఈ విషయం తెలియడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో మళ్లీ ఎమ్మార్పీకే పాలు సరఫరా చేసేలా ఉత్తర్వులిచ్చారు. అయితే సదరు పంపిణీ దారుడు చెబుతున్న ప్రకారం ఇతర జిల్లాల్లోనూ ఎమ్మార్పీ కంటే రూ.2 అదనంగానే ఉందని, దూరభారం, కమీషన్ తగ్గింపు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆదేశాలిచ్చారని చెబుతున్నారు. ఈ వ్యవహారంపై ఆదిలాబాద్ విజయ డెయిరీ డీడీ కే నందకుమారిని 'సాక్షి' వివరణ కోరగా, తాను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాని తెలిపారు. గతంలో ఉన్న ఉత్తర్వులను మార్చేస్తూ, ప్రస్తుతం ఎమ్మార్పీకే సరఫరా చేసేలా ఇచ్చామని తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో డీటీడీవో విచారణ

- హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల వినతి

సాక్షి ఎఫెక్ట్

కోటపల్లి: పాఠశాల పునఃప్రారంభం రోజు కాకుండా సోమవారం వచ్చిన విద్యార్థినులు, వారితో వచ్చిన తల్లిదండ్రులను కోటపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ బయటే వానలో నిల్చోబెట్టారు. దీనిపై 'ఆలస్యంగా వచ్చారని..' శీర్షికన మంగళవారం సాక్షిలో ప్రచురించిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. డీటీడీవో జనార్దన్ పాఠశాలను సందర్శించారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థినులతో మాట్లాడి హెచ్‌ఎం అశోక్‌ను మందలించినట్లు సమాచారం. విద్యార్థినులు పాఠశాలకు సక్రమంగా హాజరు కావాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థినులను తీర్చిదిద్దాలని హెచ్‌ఎంను ఆదేశించారు. కాగా, విచారణకు వచ్చిన డీటీడీవో విద్యార్థినులు, హెచ్‌ఎం అశోక్ ముందే విచారణ చేపట్టారు. దీంతో విద్యార్థినులు హెచ్‌ఎంపై ఫిర్యాదు చేయడానికి ఇబ్బంది పడినట్లు సమాచారం. గతంలో పలుసార్లు హెచ్‌ఎంపై జిల్లా అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. అయినా నామమాత్రపు విచారణతో అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు స్పందించి బాలికల పాఠశాలకు మహిళా హెచ్‌ఎంను నియమించాలని, హెచ్‌ఎం వైఖరిపై లోతుగా విచారణ జరిపించాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీటీడీవో జనార్దన్

క్లుప్తంగా

నల్ల పోచమ్మ ఆలయంలో చోరీ

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ శివారులో ఉన్న నల్ల పోచమ్మ ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. మంగళవారం అర్చకులు భీంజీ ఆలయానికి వెళ్లి చూడగా తలుపులు పగులగొట్టి కనిపించాయి. లోనికి వెళ్లిచూడగా హుండీని ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. హుండీలో సుమారు రూ.10 వేల నగదుతో పాటు 5 తులాల వెండి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

నంనూర్‌లో..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని నంనూర్ పునరావాస కాలనీలో మంగళవారం చోరీ జరిగింది. నంనూర్‌లో నివాసం ఉంటున్న ఎలిగేటి భాగ్య-పోచం దంపతులు ఉదయం ఇంటికి తాళం వేసి మంచిర్యాలలో నివాసం ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండటంతో ఆందోళనకు గురయ్యారు. బీరువాను పరిశీలించగా బంగారం, వెండి వస్తువులు కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై స్వరూప్‌రాజ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై బాధితుల నుంచి ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

బైక్ చోరీ కేసులో జైలు

మంచిర్యాలక్రైం: బైకు దొంగిలించిన వ్యక్తికి మొదటిఅదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జీ.కవిత మంగళవారం ఎనిమిది నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు సీసీసీ నస్పూర్ ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్న హుజురాబాద్‌కు చెందిన పుప్పాల రామకృష్ణకు చెందిన ద్విచక్ర వాహనాన్ని 2024 ఆగస్టు 28న పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన దేవసహాయం సెల్వ దొంగిలించాడు. రామకృష్ణ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సుగుణాకర్ కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నిందితునికి ఎనిమిది నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

'కళాశాలల బంద్ విజయవంతం చేయాలి'

మంచిర్యాలఅర్బన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 2, 3, 4 తేదీల్లో చేపట్టిన డిగ్రీ, పీజీ, ఇంజనీర్ కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సికిందర్ కోరారు. మంగళవారం మంచిర్యాలలో బంద్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కార్తీక్, అన్వేష్, తిరుపతి, సిద్దు, అంజి, విద్యార్థులు రాజేశ్వరి, వైష్ణవి, తిరుమల, సింధు పాల్గొన్నారు.

క్షయ నివారణే లక్ష్యం

చెన్నూర్: క్షయ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎన్‌టీఈపీ పీవో డాక్టర్ సుధాకర్‌నాయక్ అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక బస్తీ దవాఖానాలో మంగళవారం టీబీ నిర్ధారణ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 25 మందికి టీబీ, 62 మందికి హెచ్‌ఐవీ, 32 మందికి ఎక్స్‌రే పరీక్షలు చేసినట్లు తెలిపారు. వైద్యులు కృష్ణతేజ, లక్ష్మీ ప్రసన్న, సీహెచ్‌వో వెంకటేశ్వర్, సబ్ యూనిట్ ఆఫీసర్ జగదీశ్ పాల్గొన్నారు.

☞ మంచిర్యాల జిల్లా కేంద్రంలో డిగ్రీ చదువుతున్న విద్యార్థి ఆన్‌లైన్ ద్వారా రమ్మీ ఆట ఆడాడు. తొలుత డబ్బులు రావడం ప్రారంభం కావడంతో రెఫరల్ గ్రూప్ క్రియేట్ చేయడంతో తన అకౌంట్లో డబ్బులు జమ అవుతాయని మెసేజ్ వచ్చింది. పలు దఫాలుగా రూ.2 లక్షల వరకు జమయ్యాయి. దీంతో ఇంకా ఎక్కువ డబ్బులు పెట్టి రమ్మీ ఆడడం మొదలుపెట్టాడు. రూ.3 లక్షలు పోగొట్టుకున్నాడు. దీంతో ఖాతాలో జమ అయిన డబ్బులు డ్రా చేసేందుకు ప్రయత్నించగా బ్యాంకు ఖాతా ఫ్రీజ్ అయ్యింది. ఇతనొక్కడే కాదు.. ఇలా జిల్లాలో చాలా మంది యువత రమ్మీ గేమింగ్ యాప్‌ల సంస్కృతికి బలైపోతున్నారు.

☞ మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న ఓ విద్యార్థి మొదట రూ.500 పెట్టి రమ్మీ ఆడగా రూ.1000 గెలిచాడు. రెండోసారి రూ.2వేలు పెట్టి ఆడగా రూ.3,500 గెలిచాడు. ఇలా ఆడుతూ చివరికి రూ.2 లక్షలు అప్పుల పాలయ్యాడు. దీంతో తల్లిదండ్రులు కొనిచ్చిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను అమ్మేసి అప్పులు చెల్లించాడు.

☞ నిర్మల్ జిల్లాకు చెందిన ఓ వ్యాపారికి తాత ముత్తాతల నుంచి వచ్చిన కోట్ల రూపాయల స్థిరాస్తి ఉండేది. ఊర్లో అందరూ ఆ వ్యాపారి వద్దనే అప్పులు తెచ్చుకునే వారు. కాగా సదరు వ్యాపారి ఆన్‌లైన్ రమ్మీకి బానిసై ఆస్తులన్నీ కోల్పోవడంతో సామాన్య వ్యక్తిగా జీవిస్తున్నాడు.

ఆన్‌లైన్ జూదం.. జీవితాలు ఆగం

- యువత జీవితాలపై మాయాజాలం
- గేమింగ్ ముసుగులో రమ్మీ ఉచ్చు..
- టైమ్ పాస్‌తో మొదలై అప్పుల ఊబిలోకి
- ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్న యువత



మంచిర్యాలక్రైం: జిల్లాలో ఆన్‌లైన్ రమ్మీ గేమింగ్ యాప్‌ల సంస్కృతి పెరుగుతోంది. యువత జీవితాలపై బలమైన దాడి చేస్తున్నాయి. గేమింగ్ ముసుగులో ఆన్‌లైన్ జూదపు బానిసత్వం విస్తృతంగా వ్యాపిస్తోంది. ఫలితంగా అనేక మంది ఈ ఉచ్చులో చిక్కుకుని అప్పులు మూట గట్టుకుంటున్నారు. వాటిని తీర్చలేక చివరికి ప్రాణాలు తీసుకుంటున్నారు. ప్రధానంగా ప్రముఖ పట్టణ ప్రాంతాలతో పాటు పల్లెల్లో సైతం ఆన్‌లైన్ జూదం పెరిగింది. రమ్మీ కలర్, ఏ23 రమ్మీ, వెల్త్ రమ్మీ, జంగిల్ రమ్మీ వంటి యాప్‌లు టాప్-డౌన్‌లేడెడ్‌గా ఉన్నాయి. టెలిగ్రామ్ చానల్స్ ద్వారా 100 శాతం గెలుపు ట్రిక్స్ మీకు మద్దతు అందించే రమ్మీ టీచర్స్ తదితర పేర్లతో ఇన్‌ఫ్లూయెన్సర్లు మోసం చేస్తూనే ఉన్నారు.

అందరూ టార్గెటే...

యూత్ నుంచి గృహిణుల వరకు అన్నివర్గాలను ఈ రమ్మీ యాప్‌లు టార్గెట్ చేస్తూ విస్తరిస్తున్నాయి. బీటెక్, డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు.. ఇలా అనేకమంది ఆకర్షితులవుతున్నారు. ముఖ్యంగా ప్రధాన పట్టణాల పరిధి విద్యాసంస్థల్లో చదివేవారు, ప్రభుత్వ, ప్రైవేటు అధ్యాపకులు, ఉద్యోగులు ఆర్థిక ఒత్తిడిలో ఉన్నవారు. టైమ్‌పాస్‌గా మొదలు పెట్టి ఆతర్వాత ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నారు. వారం రోజుల క్రితం జిల్లాలోని ఓ ప్రభుత్వ శాఖలో పనిచేసే చిరుద్యోగి ఆన్‌లైన్ రమ్మీ గేమ్ ఆడి సుమారు రూ.40లక్షల వరకు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

మోసం ఎలా జరుగుతోందంటే...

మొదటి మూడు గేములు గెలిచేలా ఈ యాప్‌లను రూపొందించి నమ్మకం కలిగిస్తారు. ఆ తర్వాత చివరికి 'ఆటోబాట్' వాడడం వల్ల యూజర్ గెలిచే అవకాశం కనీస స్థాయికి దిగిపోతోంది. యూజర్ నెగ్గడం పక్కన పెడితే... ఒక వేళ గెలిచినా ఆ డబ్బును దక్కించులేక పోతున్నారు. అంతేకాకుండా గెలుచుకున్న డబ్బును విత్ డ్రా చేసుకోవడంలో ఆలస్యం జరిగితే పూర్తిగా నిలిపివేస్తున్నట్లు పలువురు బాధితులు పేర్కొంటున్నారు. గేమ్‌లోకి స్నేహితులను లాగితే ఒకరికి రూ.100 బోనస్ అంటూ రెఫరల్ మాయాజాలంతో పాటు అనేక రకాలుగా వల వేస్తున్నట్లు తెలుస్తోంది.

హెల్ప్‌డెస్క్ ఉన్నా ఫలితం శూన్యం

తెలంగాణ వ్యాప్తంగా సైబర్ సెల్ గేమింగ్ యాప్ మోసాలపై, సైబర్ మోసాలపై పోలీస్ శాఖ స్పెషల్ హెల్ప్‌లైన్ 1930 ప్రారంభించింది. కానీ గేమింగ్ యాప్‌లపై పోలీస్ శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఆన్‌లైన్ యాప్‌లు విదేశి సంస్థల ఆధీనంలో ఉండడం వల్ల వాటిపై నేరుగా చర్య తీసుకోవడం కష్టంగా ఉందని పోలీస్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో గేమ్ యాప్‌లు వినియోగించే వారు ఎక్కువవుతున్నారని ఓ పోలీస్ అధికారి ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం.

భవిష్యత్ నాశనం చేసుకోవద్దు



ప్రభుత్వం నిషేధించిన ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం చట్టరీత్యా నేరం. నిర్వాహకులు, ఆడిన వారిపై చర్యలు ఉంటాయి. యువత ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం సరికాదు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారో గమనిస్తూ ఉండాలి. ఆన్‌లైన్ ఆటలకు బానిస కావొద్దు. బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు.
– ఎగ్గడి భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

ఐఈఈఈ లోగో ఆవిష్కరణ



లోగో ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర: బాసర ఆర్జీయూకేటీలో ఐఈఈఈ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్) స్టూడెంట్ బ్రాంచ్ అధికారిక లోగోను మంగళవారం వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ ఈ.మురళీదర్శన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఐఈఈఈ అనేది ప్రపంచంలో అతిపెద్ద సాంకేతిక ప్రొఫెషనల్ సంస్థ అని, ఇది విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మమేకమయ్యే అవకాశాన్ని, వృత్తిపరమైన నిపుణులతో నెట్‌వర్కింగ్ అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్లు డాక్టర్ విఠల్, డాక్టర్ మహేష్, డాక్టర్ చంద్రశేఖర్ విభాగాధిపతి డాక్టర్ భావ్ సింగ్, అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళ మెడలోంచి గొలుసు అపహరణ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

బెల్లంపల్లిరూరల్: ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు దొంగిలించిన ఘటన బెల్లంపల్లి మండలంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల మేరకు రవీందర్‌నగర్‌కు చెందిన గాదం శ్వేత సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న రెండు తులాల గొలుసు అపహరించాడు. బాధిత మహిళ కేకలు వేయడంతో దొంగ పరారయ్యాడు. పోలీసులకు సమాచారం అందించడంతో మంగళవారం డాగ్‌స్కాడ్‌తో ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫార్మా పేలుడులో దండేపల్లి వాసి మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

దండేపల్లి: సంగారెడ్డి జిల్లా సిగాచి ఫార్మా పరిశ్రమలో సోమవారం జరిగిన పేలుడు ఘటనలో మంచిర్యాల జిల్లా దండేపల్లికి చెందిన వొజ్జకేశవుల నాగేశ్వరరావు, అలియాస్ రాజు (52) మృతి చెందాడు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చేసిన నాగేశ్వర్‌రావు గతంలో కొద్దిరోజులు సిర్పూర్ పేపర్ మిల్‌లో పనిచేశాడు. ఆ తరువాత హైదరాబాద్ వెళ్లి పటాన్ చెరువులో నివాసం ఉంటూ పదేళ్లుగా సిగాచి ఫార్మా పరిశ్రమలో క్వాలిటీ సెల్ విభాగంలో పనిచేస్తున్నాడు. మృతునికి భార్య హేమలత, ఇద్దరు కుమారులున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..



మనోహర్ (ఫైల్)

వాంకిడి: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. మండలంలోని రాజీవ్ నగర్ గ్రామానికి చెందిన నాయిని మనోహర్ (45) గత నెల 26న మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన పప్పు రమణ (40) జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో మంగళవారం మృతి చెందినట్లు టూటౌన్ ఎస్సై ముకుంద్‌రావు తెలిపారు. మహారాష్ట్రలోని కిన్వట్‌లో కూరగాయల నర్సరీ నిర్వహిస్తున్న రమణ కిన్వట్ నుంచి ఆదిలాబాద్ వైపు మ్యాక్స్ బొలెరో వాహనంలో వస్తుండగా ఆదిలాబాద్ వైపు నుంచి కిన్వట్ వైపు వెళ్తున్న మహారాష్ట్ర ఆర్టీసీ బస్సు కిన్వట్-అంబాడి ప్రాంతంలో ఢీకొట్టింది. తీవ్రగా యాలు కావడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు జీరో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గల్ఫ్‌లో టెంబుర్నివాసి అనుమానాస్పద మృతి




సంతోష్ (ఫైల్)

నర్సాపూర్(జి): ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లిన జిల్లాకు చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జి) మండలంలోని టెంబుర్ని గ్రామానికి చెందిన బొగడమీది సంతోష్ (36) జూన్ 21న గల్ఫ్ దేశంలోని అబుదాబికి కూలీపని నిమిత్తం వెళ్లాడు. ఇంతలో ఏంజరిగిందో తెలియదుకానీ అక్కడి ఎంబసీ, ముస్సాపా పోలీస్ స్టేషన్ నుంచి బొగడమీది సంతోష్ మృతి చెందాడని మంగళవారం తనకు ఫోన్ వచ్చిందని మృతుని భార్య ప్రేమల తెలిపింది. తన భర్త మృతికి గల కారణాలు తెలపాలని, మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేలా చూడాలని వేడుకుంటోంది.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

వాంకిడి: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల మేరకు బెజ్జూర్ మండలంలోని రేచిని గ్రామానికి చెందిన వడై వెంకటి (40)కి వాంకిడి మండలంలోని నార్లాపూర్‌కు చెందిన తానుబాయితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. దీంతో తానుబాయి అతనితో మద్యం మానిపించాలని నార్లాపూర్‌కు తీసుకువచ్చింది. అక్కడే వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలం బాగానే ఉన్న వెంకటి మళ్లీ మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించి ఇంటికి వచ్చి నిత్యం భార్యతో గొడవపడేవాడు. కుటుంబ సభ్యులు మందలించేందుకు ప్రయత్నిస్తే ఉరేసుకుంటానని బెదిరించేవాడు. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం వాంకిడి వెళ్తానని చెప్పి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం అదే గ్రామానికి చెందిన వడై సంతోష్ చేనులో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. తానుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

భూతగాదాల కారణంగా..



ఆనంద్‌రావు (ఫైల్)

నర్సాపూర్(జి): భూతగాదాలతో మనస్తాపం చెంది ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కుస్లి గ్రామానికి చెందిన నార్వాడె ఆనంద్ రావు(54)కు, తన సమీప బంధువులకు మధ్య భూతగాదాలు ఉన్నాయి. దీంతో మనస్తాపం చెందిన ఆనంద్‌రావు సోమవారం ఇంటివద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆటోలో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని భార్య అనురాధ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో యువకుడు..

సోన్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపి తెలిపిన వివరాల మేరకు మండలంలోని సాకేర గ్రామానికి చెందిన సారంగ విజయ్ (29) అనే కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం గ్రామానికి సమీపంలో ఉన్న సూర్యకుటీర్‌లో చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుని తల్లి సుశీల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై గోపి సంఘటన స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరు..



వెంకటి (ఫైల్)

సాత్నాల: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గౌతమ్ పవర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని పార్డీ (బి) గ్రామానికి చెందిన బండి వెంకటి (38) పంటచేనులో రసాయన మందులు పిచికారీ చేస్తుండగా ఎదురుగాలి వీయడంతో అతనిపై పడి అనారోగ్యానికి గురయ్యాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది గతనెల 29న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతునికి కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుని భార్య పుష్పలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి రెండేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు జడ్జి శ్రీవాణి మంగళవారం తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయల అధికారి దల్లు సింగ్ తెలిపారు. లోకేశ్వరం మండలం భామిని(బి) గ్రామానికి చెందిన త్రయంబకరావు 2020లో అడవి జంతువులు వస్తున్నాయని తన మొక్కజొన్న చేనుచుట్టూ జియో వైరు చుట్టి విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడు. అటుగా వెళ్లిన అదే గ్రామానికి చెందిన బాలాజీ వైరును తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో విచారణ చేపట్టి నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు.

'లేబర్‌కోడ్‌ల రద్దుకు ఉద్యమించాలి'



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

పాతమంచిర్యాల: కార్మికచట్టాల సవరణ పేరుతో తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌ల రద్దుకు ఉద్యమించాలని జాతీయ కార్మిక సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, టీయూసీఐ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు రోజుల పనివిధానం నాలుగు రోజులకు కుదించడం వలన కార్మికులు ఉపాధి కోల్పేయే ప్రమాదముందన్నారు. లేబ్‌కోడ్‌ల అమలును కేంద్రం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులు, చట్టాల రక్షణకోసం ఈనెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ఎండీ చాంద్‌పాషా, టీయూసీఐ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్, నాయకులు మిట్టపల్లి పౌలు, తాళ్లపల్లి శ్రీనివాస్, బ్రహ్మానందం, అరుణ, సురేందర్, చిన్నయ్య, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న మారుపాక అనిల్‌కుమార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దళితుల అభివృద్ధికి పాటుపడాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం గుడిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అభయహస్తం పేరుతో అర్హులైన దళిత కుటుంబాలకు రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలులో విఫలమైందన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించకుండా దళితుల ఆర్థికాభివృద్ధికి కేటాయించాలని, దళితులకు భూపంపిణీ చేపట్టాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ శాతం పెంచాలని, ప్రైవేట్ రంగాల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, జిల్లా ఉపాధ్యక్షుడు రవి, సహాయ కార్యదర్శి తిరుపతి, జాతీయ సమితి సభ్యుడు అశోక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజారత్నం, ఏఐవైఎఫ్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు అబ్రహం, ఏలియా, యోసేపు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఈ కార్యాలయంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ కాలనీలో ఉన్న విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కార్యాలయంలో మంగళవారం అద్దె వాహనం డ్రైవర్ ఆత్మహత్యకు యత్నించిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. విద్యుత్ శాఖలోని అద్దెట్రాలీ డ్రైవర్ సదానందం ఉదయం 10:30 గంటలకు విద్యుత్ శాఖ గ్రౌండ్ ఫ్లోర్‌లోకి కిరోసిన్ డబ్బాతో వెళ్లాడు. ఒంటిపై కిరోసిన్ పోసుకుని కార్యాలయం బయటకు వచ్చాడు. గమనించిన కార్యాలయ సిబ్బంది అతని ఒంటిపై నీళ్లు పోశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ గత ఎస్‌ఈ గంగాధర్ తనకు రావాల్సిన జనవరి, ఫిబ్రవరి బిల్లులు చెల్లించకుండా అనేక ఇబ్బందులకు గురిచేశాడన్నారు. దీంతో గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బిల్లుల చెల్లింపు మార్చి నెలతో ముగిసిపోయిందని వాపోయాడు. రూ.80 వేల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో అనేక ఆర్థిక ఇబ్బదులు ఎదుర్కొంటున్నానని వాపోయాడు. తనకు న్యాయం జరగకపోవడంతోనే ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపాడు. కాగా ఘటనపై ఎలాంటి పోలీసు కేసు నమోదు కాలేదు. ఈ విషయం మీడియాకు తెలియనీయకుండా విద్యుత్ శాఖ అధికారులు జాగ్రత్త పడ్డారు. అద్దె వాహనాల యాజమానులు, డ్రైవర్లతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

నా దృష్టికి ఇప్పుడే వచ్చింది

నేను రెండు రోజుల క్రితమే బాధ్యతలు చేపట్టా. వాహన బిల్లుల విషయం ఇప్పుడే నా దృష్టికి వచ్చింది. కొంత అధికారుల నిర్లక్ష్యం ఉంటే కొంత అతని తప్పిదం కూడా ఉంది. ఇప్పుడే అతనితో మాట్లాడా. పెండింగ్‌కు సంబంధించి స్పెషల్ ఎన్‌వోసీ తీసుకుని అతని బిల్లు మంజూరు చేసేలా చూస్తా.
– ఉత్తం జాడే, జిల్లా విద్యుత్ శాఖ అధికారి

దోమలను నివారించాలి



అవగాహన కల్పిస్తున్న అనిత

మంచిర్యాలటౌన్: దోమలను నివారించాలని జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ అనిత సూచించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ద్వారా మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలో కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. అనంతరం దోమ తెరల వినియోగంపై అవగాహన కల్పించారు. విద్యార్థులుండే అన్ని గదుల్లో దోమల నివారణకు మందు పిచికారి చేయించారు. డాక్టర్ శివప్రతాప్, శ్రీనివాస్, సీహెచ్‌వో దీక్షితరాణి, కళాశాల ప్రిన్సిపాల్ అనూష, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, ఏఎన్ఎం అంజలి, ఎంటీఎస్ సంతోష్ పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు

జన్నారం: మహిళను కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు జన్నారం మండలం తపాలాపూర్ గ్రామానికి చెందిన దుర్గం దుర్గవ్వ, ఆమె కుటుంబ సభ్యులు ఇంటిముందున్న కాలిబాట గుండా పొలానికి వెళ్తున్నారు. మే 31న మధ్యాహ్నం 3 గంటలకు దుర్గవ్వ, ఆమె మరిది కుమారుడు దుర్గం తేజ దారిగుండా వెళ్తుండగా తోట్ల రాజమొగిలి తన దారి గుండా వెళ్లవద్దని కులం పేరుతో నానా బూతులు తిట్టాడు. మళ్లీ వస్తే చంపుతానని బెదిరించాడు. మంగళవారం దుర్గవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొగిలిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాత నేరస్తుల బైండోవర్



తహసీల్దార్ ఎదుట పాత నేరస్తులు

కాగజ్‌నగర్‌టౌన్: గతంలో నాటుసారా, దేశీదారు అమ్ముతూ పట్టుబడిన 8 మంది పాత నేరస్తులను ఎక్సైజ్ అధికారులు మంగళవారం తహసీల్దార్ మధుకర్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మరోసారి నాటుసారా, దేశీదారు అమ్మి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే రూ.లక్ష జరిమానాతో పాటు జైలుశిక్ష విధిస్తామని హెచ్చరించారు.

దేశీదారు పట్టివేత



పట్టుకున్న దేశీదారుతో ఎక్సైజ్ అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్‌కు కారులో అక్రమంగా తరలిస్తున్న దేశీదారు మద్యాన్ని సోమవారం రాత్రి పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.జ్యోతి ఆదేశాల మేరకు పట్టణంలోని ఈఎస్ఐ మూలమలుపు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో అక్రమంగా తరలిస్తున్న 17 కాటన్లు 90 ఎంఎల్ దేశీదారు బాటిళ్లు లభ్యమయ్యాయి. మద్యం విలువ సుమారు రూ.68 వేలు ఉంటుందన్నారు. కౌటాలకు చెందిన దుర్గం సాయిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో ఎస్సై లోబానంద్, సిబ్బంది రాజ్‌కుమార్, హుస్సేన్, మండల్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో దళారీ వ్యవస్థను నిర్మూలించాలి

పాతమంచిర్యాల: వ్యవసాయ రంగంలో దళారీ వ్యవస్థను నిర్మూలించాలని సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోతే రాజలింగు అన్నారు. మంగళవారం ప్రపంచ వ్యవసాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళారీ వ్యవస్థ వలన రైతులు తమ పంటలను సరైన ధరలకు అమ్ముకోలేకపోతున్నారన్నారు. పంటచేతికొచ్చిన సమయంలో అమ్మకం కోసం దళారులను ఆశ్రయించి కనీస మద్దతు ధర పొందలేకపోతున్నారన్నారు. దళారులు నిర్ణయించిన ధరకే పంటలను అమ్ముకుని ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. రైతులు పండించిన పంటలను నిలువ చేసుకుని వారికి నచ్చిన ధరకు విక్రయించుకునేలా ప్రభుత్వాలు గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజ్‌ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సురేందర్, సతీశ్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: ఐఈఆర్‌సీ, నాన్ ఐఈఆర్‌సీలో ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు ఫిజియోథెరపీ సేవలు అందించేందుకు గుర్తింపు పొందిన స్టేట్ పారామెడికల్ బోర్డు ద్వారా బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజియోథెరపీ (బీపీటీ) కోర్సు చేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు స్థానిక మండలానికి చెందిన వారికి ప్రాధాన్యత ఉంటుందని, ఈనెల 5 లోగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారానికి రెండు సార్లు సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలకు ఫిజియోథెరపీ సేవలు అందించాల్సి ఉంటుందన్నారు.